

# శ్రీ కల్యాణీయం

## – సింగీతం లక్ష్మీ కల్యాణి



*విశేషమైన ఖ్యాతి గడించిన సినీదర్శకుడి భార్య ఐనప్పటికీ ,*

*సాధారణ గృహిణిగా ఎదుగుతూ*

*కుటుంబాన్ని అందంగా తీర్చిదిద్దుకున్న ఓ మహిళ స్ఫూర్తిదాయకమైన ఆత్మకథ..!!*

*(గత సంచిక తరువాయి)*

**తరువాత** 'జేగంటలు', అక్కినేని నాగేశ్వరరావుగారి అన్నపూర్ణ స్టూడియోస్ 'పిల్లజమిందారు' వచ్చాయి. 'మంగళతోరణాలు', ఏకాంబరేశ్వరావుగారి సారథ్యంలోని 'గమ్మత్తు గూఢచారులు', ఇలా కొన్ని సినిమాలు కమర్షియల్‌గా పోలేదు. కొన్నాళ్ళకు కర్ణాటకలో డా. రాజ్‌కుమార్‌గారితో ఒక సినిమా చేసే అవకాశం వచ్చింది. 'హాలు - జేను' దాని పేరు. పాలగుమ్మి పద్మరాజుగారి కథ, రాజ్‌కుమార్ గారు హీరో హీరోయిన్ మాధవి, రెండవ హీరోయిన్ రూప అనే అమ్మాయి. ఇది సిల్వర్ జూబ్లీ చేసుకుంది. మంచి పేరు వచ్చింది. కర్ణాటక ప్రభుత్వపు వుత్తమ చిత్రం అవార్డు వచ్చింది. అప్పట్నించి రాజ్‌కుమార్ గారే మా వారితో కొన్ని సినిమాలు వరుసగా నిర్మించారు. 'చెలుసువ మోడగుళు' కదిలే మేఘాలు అని అర్థం. మావారి కథ, సంగీతం, డైరెక్షను 'భాగ్యద లక్ష్మీ బారమ్మా', ఇవి రెండూ సిల్వర్ జూబ్లీ సినిమాలే. తరువాత వాళ్ళ చివరి అబ్బాయి, అప్పటి చైల్డ్ ఆర్టిస్ట్, పునీత్ రాజ్‌కుమార్ డబుల్ రోల్‌లో 'ఎరడు నక్షత్రగళు' (Prince & Pauper Story) చేసారు. తర్వాత పి.ఏకాంబరేశ్వరరావుగారు నిర్మాతగా రాజ్‌కుమార్ గారితో 'శ్రావణబంతు' చేసారు. ఆ సినిమా కథ కూడా మా వారిదే రంగారావుగారి సంగీతం. దానికి కూడా పేరు వచ్చింది. తరువాత 'జ్వాలాముఖి' సినిమాకి దర్శకత్వం మాత్రమే వహించారు. ఈ కన్నడ సినిమాలు చేసేటప్పుడు రాజ్‌కుమార్‌గారు ఆయనకి బాగా స్వేచ్ఛ ఇవ్వడం మూలాన, ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా తీసినందున అన్ని సూపర్ డూపర్ హిట్లు అయ్యాయి. 'దేవతా మనుష్య' అనే సినిమా కథ, డైరెక్షన్ మావారే. సగం సినిమా అయిం తర్వాత ఆయన విగ్గు పెట్టుకోకుండా ఒరిజనల్ జుట్టుతో కనిపిస్తారు. ఈ సినిమాలో రాజ్‌కుమార్ గారికి బెస్ట్ యాక్టర్ అవార్డు వచ్చింది. రాజ్‌కుమార్‌గారు తన పెద్ద కొడుకు శివరాజ్ కుమార్ మొదటి సినిమాకి పరిచయం చేయమని కోరగా 'ఆనంద్' అనే సినిమాకి దర్శకత్వం వహించారు. దీని కథ కూడా సింగీతం వారిదే రెండవ అబ్బాయి రాఘవేంద్ర రాజ్ కుమార్‌ని కూడా మా వారే పరిచయ చేసి, అతనితో రెండు సినిమాలు చేసారు. ఇవన్నీ చూస్తున్న అప్పటి కర్ణాటక ముఖ్యమంత్రి బంగారప్పగారబ్బాయి కుమార్ బంగారప్ప వసంత్ కూడా సింగీతంని సినిమా చేయమంటే క్షీరసాగర అనే సినిమా చేసారు. కథ మా పెద్దమ్మాయి శకుంతల సతీష్‌ది. అమల హీరోయిన్. ఇది వందరోజులు ఆడింది. 'క్షీరసాగర' తరువాత కుమార్ బంగారప్ప ప్రొడక్షన్‌కి అతని హీరోగా మా వారి దగ్గర కో డైరెక్టరుగా పనిచేస్తున్న మా పూర్ణ, 'బెళ్ళియప్ప - బంగారప్ప అనే సినిమా డైరెక్ట్ చేసాడు. తరువాత కాలంలో తమిళంలో 'వైదేహి' అనే సీరియల్ డైరెక్ట్ చేసాడు. వసంత్ సినిమా వందరోజులు ఆడింది. అతని చెల్లెలి పెళ్ళికి కూడా వెళ్ళి వచ్చాము. అతని అక్కని రాజ్‌కుమార్ గారి పెదబ్బాయి శివరాజ్ కుమార్‌కి ఇచ్చి పెళ్ళి చేసారు. నేను, మా వారు కూడా వెళ్ళి వచ్చాము.

మా చెల్లెలు పెళ్ళైయిన తరువాత మా నాన్నగారికి ఎన్నాళ్ళకీ తన కొత్త ఇల్లు పూర్తి చేయడానికి డబ్బు కుదరలేదు. ఏదో చిన్న చిన్న పనులు ఫ్లోరింగ్ పూర్తి చేసి గృహప్రవేశ ముహూర్తం పెట్టుకున్నారు. మా గృహప్రవేశానికి నాలుగు రోజుల తరువాత అయినందున మా నాన్నగారు గృహప్రవేశానికి రాకుండా, మా అమ్మా, చెల్లెలిని పంపించారు. మా గృహప్రవేశం అవ్వగానే, నేను, నా పిల్లలు అమ్మా వాళ్ళతో హైదరాబాదు వెళ్ళాము. అక్కడ గృహప్రవేశము బాగా జరిగింది. ఇల్లు మంచి ఏరియాలో వున్నందున ఒకటి రెండు బస్సులకి స్టాపు దగ్గర్లో వున్నందున అనుకూలంగా వుండింది. ఇంకో కిలోమీటరు పోతే రెండో పక్క సరోజని హాస్పటల్ రోడ్డు. బజారు, అన్నీ దగ్గర్లోనే వున్నాయి. ఇంతలో ఒక పెద్ద మనిషి మా నాన్నగారి ఇల్లు చూసి ఆయన మంచితనం తెలుసుకుని రెండవ భాగం ఇల్లు తను అద్దెకు తీసుకుంటాననీ తలుపులు, కిటికీలు తానే పెట్టించుకుంటానని ఇంకేమైనా పనులు వుంటే తానే పూర్తి చేసుకుని తన కుటుంబముతో అద్దెకు వుంటానని, అడ్వాన్సు మొత్తం వీటికి వుపయోగించుకుంటానని చెప్పాడు. అప్పుడు నిజంగా మా నాన్నగారికి దేవుడే ఆయన రూపంలో వచ్చి తన్ను ఆదుకుంటున్నాడేమో అని ఫీలై వెంటనే ఒప్పుకున్నారు. తన వైపు భాగం కూడా ఎలాగో పూర్తి చేసుకుని అద్దె ఇల్లు ఖాళీ చేసి ఈ కొత్త ఇంటికి వచ్చేసారు. చూడండి మంచి వాళ్ళకెప్పుడూ మంచే జరుగుతుంది. మా అమ్మ కూడా చాలా సంతోషించింది. ఇంత త్వరగా వాళ్ళ సమస్య తీరుతుందని అనుకోలేదు. ఎటొచ్చీ మా అమ్మమ్మ ఈ ఇల్లు చూడలేదు అనిపించింది మా అమ్మకి. ఇలా కొన్నాళ్ళు ఆ రెండో వాటాలోని టెనెంట్స్ ఒకరు మార్చి ఒకరు ట్రాన్స్‌ఫర్ వల్ల మారుతూ వచ్చారు. మా చెల్లెలి రెండో కొడుకు బాలాజీ ఇంటర్ వరకు వాళ్ళ అమ్మా, నాన్న దగ్గర వుండి చదువుకునేవాడు. వాళ్ళ అన్నయ్య రాఘవేంద్రరావు అందరూ రాజా అంటారు. వీడు మాత్రం చిన్నప్పట్నుంచి వేరే వూళ్ళల్లో హాస్టల్‌లో వుంటూ చదువుకునేవాడు. వాళ్ళ నాన్న పోస్టు మాష్టరు వలన బదిలీలు వుంటాయి. చెల్లెలు తులసి ఇంకా చిన్నపిల్ల. మా చెల్లెలు బి.యిడి, అయినా కూడా పెళ్ళై చాలా సంవత్సరాలు వుద్యోగం చేయలేదు. ఇలా కొన్ని సంవత్సరాలు గడిచాయి. మా నాన్నగారు రెండు పూటలా ట్యుటోరియల్ కాలేజీలకు వెళ్ళి కష్టపడి సంపాదించేవారు. నేను మాత్రం అమ్మా, నాన్న పెద్ద వాళ్ళు అవుతున్నారు కదా, ప్రయాణాలు చేయలేరు కదా అని అప్పుడప్పుడు పిల్లలని వదిలి పెట్టి హైదరాబాదుకు వెళ్ళి వస్తుండేదాన్ని. సెలవులయితే పిల్లలు కూడా వచ్చేవారు.

ఇలా కొన్నాళ్ళకి మా నాన్నగారికి అప్పులెక్కువై రెండోవాటా ఇల్లు అమ్మకానికి పెట్టారు. అందరూ వచ్చి ఒక్కవాటా కాదు మొత్తం ఇల్లు యిస్తే కొంటామని అనేవారట. మా నాన్నగారు ఫోన్ చేసేవారు. డైరెక్టర్స్ కాలనీలోనికి వెళ్ళాక మాకు ఫోను వచ్చిందిలెండి. వాళ్ళు వున్న వాటా కూడా అమ్మడానికి మా అమ్మకి సుతరాము ఇష్టం లేకపోయింది. కష్టపడి కట్టించుకున్న ఇల్లు కొన్నాళ్ళయినా అనుభవించవద్దా! ఏం చేయాలో తోచడం లేదని, తనకి డబ్బులకి చాలా ఒత్తిడిగా వుందని మా నాన్నగారు వుత్తరం కూడా రాశారు. ఆయన వుద్దేశం వేరే వుంది. ఆఖరుకి ఆ భాగం పై వాళ్ళెవరూ కొనుక్కోవడం లేదని, మీకేమైనా అవుతుందా! అది మనలో వుంటేనే ఆయనకి తృప్తిగా వుంటుందని మా నాన్నగారు వుత్తరం కూడా రాశారు. ఆయన వుద్దేశం వేరే వుంది. మా వారు ఆలోచించి రెండురోజుల్లో ఏ విషయం చెబుతానని రాసారు. ఆ సమయానికి ఆయనకి 'సొమ్మొకడిది సోకొకడిది' షూటింగు జరుగుతూంది. తాను పూనుకుని నిర్ధారణకు వచ్చి, మా నాన్నగారికి మీరు ఏమి దిగులు పడవద్దని, మీ ఇల్లు కొంటామని, అది మనలోనే వుండాలని, త్వరలోనే మీకు పైకం ఏర్పాటు చేస్తానని రాసారు. దాంతో మా నాన్నగారికి చాలా రిలీఫ్ అయింది. పైగా తన ఇల్లు కూతురు, అల్లుడుకే పోతుందని సంతోషం.

మా చెల్లెలి పిల్లలు కొంచెం పెదవాళ్ళైం తర్వాత మా నాన్నగారు మా సుశీలని పిలిపించి జ్యోతి బాలమందిర్‌లో వుద్యోగం ఇప్పించారు. మొదట అది మాత్రం కూతురు చిన్నపిల్ల అయినందున దాన్ని తీసుకుని వచ్చింది. తరువాత తరువాత దాని భర్త అంగర శ్రీనివాసరావు కూడా పోస్టు మాష్టరు అయినందున హైదరాబాదుకు బదిలీ చేయించుకున్నా కూడా, బొలారం - ఐ.డి.పి.ఎల్ లాంటి దూరపు చోట్లల్లో చేసేవారు. గవర్నమెంటు వుద్యోగం వలన అతనికి ఫ్యామిలీ క్వాటర్స్ ఇచ్చేవారు. వారి ఇల్లు మా అమ్మా వాళ్ళింటికి

చాలా దూరం. రెండవ కొడుకు బాలాజీ కూడా హైదరాబాదు స్కూల్లోనే చేరాడు. బాలాజీ ఇంటర్ వరకు వాళ్ళ అమ్మా వాళ్ళతో వుండి, బి.ఏ చదవడానికి మా అమ్మా వాళ్ళింటికి వచ్చేసాడు. ముసలివాళ్ళు ఇద్దరే వున్నారు కదా అని వీళ్ళతోనే వుండేవాడు. పైగా వాడికి మా నాన్నగారు మంచి కోచింగ్‌లు కూడా ఇచ్చేవారు. బయట స్టూడెంట్స్‌లాగే వీడిని కూడా బాగా చదివించి ఐ.ఏ.ఎస్ కూడా చదివించి కలెక్టర్‌ను చేయాలని ఆయనకి కోరికగా వుండేది. చాలా సంవత్సరాలు అయిన తరువాత వాడి క్వాలిఫికేషన్స్ ఏమిటో తెలుసా! ఎం.ఏ, బి.యిడి, ఎం.ఫిల్, పి.హెచ్‌డి, కురుక్షేత్ర యూనివర్సిటి నుంచి పి.హెచ్‌డి పొందాడు. కానీ ఇవన్నీ చూడ్డానికి మా నాన్నగారు లేరుగా ఇప్పుడు. పైగా వాడు ఇప్పుడు కాలేజి ప్రిన్సిపాల్. భార్య టీచరు, ఒక అబ్బాయి. పెద్దవాడు మద్రాసులో ఐ.ఐ.టి చేసి బెంగుళూరులో ఒక పెద్ద వుద్యోగపు హోదాలో వున్నాడు. అమ్మాయి తులసి పి.జి కాలేజి లెక్చరరుగా వుంటోంది. భర్త నరసింహ ఒక పెద్ద కంపెనీలో పని. ఒక మగ పిల్లవాడు, ఒక ఆడపిల్ల. హైదరాబాదులో కొన్ని సంవత్సరాలు తరువాత మా పెద్ద చెల్లెలు సుశీల బ్రెస్ట్ కాన్సర్‌తో హాస్పటల్ పాలై రెండేళ్ళు బాధపడి చివరికి చనిపోయింది. అది స్కూల్లో పని చేసినన్నాళ్ళు ప్రతి శనివారం ఒక పూట మా అమ్మా వాళ్ళింటికి వచ్చి, అమ్మా, నాన్నగారిని చూసి మరీ వెళ్ళేది. "పిల్లలు మేము బాగా సంపాదిస్తున్నాము కదమ్మా? వుద్యోగం మానెయ్యి" అన్నా కూడా తను "టీచరు కదా, ఇన్నాళ్ళు పనిచేసాను, ఇంకా కొన్నాళ్ళు పనిచేస్తే నాకు పెన్షన్ వస్తుంది కదా!" అనేది. కానీ విషాదమేమిటంటే పెన్షన్ తీసుకోకుండానే దాని 58వ ఏటనే కన్నుమూసింది. చివరకు పెన్షన్ కళ్ళతో చూడలేదు. మా సుశీల భర్త పోస్టుమాస్టరుగా రిటైరయిన దగ్గర్నుంచీ రెండేళ్ళు తన భార్య జబ్బు వలన ఆస్పత్రిలోనే సరిపోయేదతనికి పాపం.

బాలాజీ మా అమ్మా వాళ్ళతో వుంటున్నపుడు కానీ, ఐ.డి.పి.ఎల్‌లో వుంటున్నప్పుడు కానీ మేము తీసుకున్న రెండో వాటా టెనెంట్స్ ఇచ్చే అద్దె డబ్బులు చూసుకోవడం, ఆ యింటి బాగోగులు చూడడం, ఆ యింటికి కావలిసిన రిపేరులు, మొదలైన పనులు చూసుకోవడం, మొత్తం అన్ని పనులు వాడి నెత్తిన వేసుకుని చూసుకునేవాడు. నాకు కొడుకులు లేరన్న కొరత తీర్చేవాడు. ఇటు అమ్మమ్మ, తాతగారి పనులు, ఇంకో పక్క నా యింటి పనులు మొత్తం చాలా ఓపికగా చేసేవాడు. నేను ఏమైనా మొహమాటపడి వాడిని వెనకేసుకుని వాడి నెత్తినంతా బరువు బాధ్యతలు వేస్తున్నానని బాధపడుతుంటే "పెద్దమ్మా ఈ చిన్న విషయానికి నీవు ఇంత బాధపడతావు" అనేవాడు.

హైదరాబాదులో వాళ్ళ అన్నయ్య, వాళ్ళ చెల్లెలు, కొత్త ఇంటి గృహప్రవేశం చేసుకునేటప్పుడు నాకు ఒంట్లో బాగోలేక వెళ్ళలేకపోయాను. కొన్నాళ్ళకి వాడు ఒక ఫ్లాటు కొన్నానని గృహప్రవేశానికి రమ్మని ఫోన్ చేసాడు. కానీ అప్పటికి ఇంకా నాకు ఒంట్లో బాగోలేదు. కానీ ఎందుకో వెళ్ళాలనిపించింది. మా సుశీల అప్పటికే చనిపోయింది. మా చిన్న చెల్లెలు హైదరాబాదుకి చేరుకుంది. నేను మూడ్ అవుట్‌గా వున్నాను. మా వారి ఒంట్లో బాగోలేదు. వెళ్ళడానికి వీల్లేదన్నారు. కానీ ఏడ్చేశాను నేను. నా విషయంగా, వాడిన్నాళ్ళు ఎంత శ్రద్ధ తీసుకున్నాడు? కన్నతల్లి లేఉ, నేను వెళ్ళి నా పెద్దరికం నిలబెట్టుకోవాలన్నాను. సరే, రాత్రి నిద్రలో ఏదో కలవరిచానట. మర్నాడు పొద్దున్నే లేచి "రేపు నువ్వు హైదరాబాదుకి వెళ్తున్నావు. ఒక్కదానివే వెళ్తున్నావు. తిన్నగా అక్కడికే వెళ్ళకు. పద్మా, బాబు వాళ్ళ ఇల్లు సౌకర్యంగా వుంటుంది. అక్కడ దిగు. పద్మ కొడుకు శ్రీనాథ్‌ని ఎయిర్‌పోర్టుకు వచ్చి నిన్ను పిల్చుకెళ్ళమంటాను" అన్నారు. నా సంతోషం చెప్పలేను. పద్మ ఇంటికి వెళ్ళి, అక్కడ ఒకరోజు వుండి, మా శ్రీనాథ్ నన్ను గృహప్రవేశం ఇంట్లో దింపి వెళ్ళాడు. ఎదురుగా మా సుశీల ఫోటో దండ వేసి వుంది. దాన్ని చూసి బోరుమన్నాను. మా మరిది (బాలాజీ నాన్న) అన్నాడు. "వాళ్ళిద్దరి గృహప్రవేశానికి రాలేదు నువ్వు. దీనికి మాత్రం వచ్చావు" అని దెప్పాడు. కానీ నాకూ, బాలాజీకి మధ్య వున్న అనుబంధం అతనికేం తెలుసు?

మా నాన్నగారి ఇల్లు హైదరాబాదులోని రెండవ వాటా కొన్నాము. కొన్ని నెలల తరువాత మాములు ప్రకారం మా వారు, పూర్ణ ఇంట్లో లేరు. ఏ షూటింగుకి వెళ్ళారో. ఒక రోజు రాత్రి 7.30 గంటలకు వున్నట్టుండి మా బావగారి దగ్గర నుంచి ఫోన్ వచ్చింది. పూర్ణాని పిలిచారు. అతను లేడని వాళ్ళ బాబాయితో బయటికి వెళ్ళాడు అని చెప్పాను. అతను వచ్చిన తరువాత వాళ్ళ నాన్నకి ఫోన్ చేసాడు. వాళ్ళ నాన్న ఏదో చిక్కులో ఇరుక్కున్నానని, ఇల్లు తాళం పెట్టి స్నేహితుడి ఇంట్లోనే మొత్తం కుటుంబం వుంటున్నాము అని

చెప్పారట. మా కందరికి ఏమీ అర్థం కాలేదు. వెంటనే రాత్రికి రాత్రి మా పూర్ణని మా వారు గూడూరుకి వెళ్ళి విషయం కనుక్కుని రా అని ఖర్చులకు డబ్బులు ఇచ్చి పంపించారు. ఏమి జరిగిందో ఏమో, మరునాడు మా పూర్ణ గూడూరు నుంచి వాపసు వచ్చేసాడు. పూర్ణ నాన్న హౌసింగ్ బోర్డు ఇల్లు కట్టించుకున్న తాలుకు డబ్బు ఇకా బాకీ వున్నదని, కొత్తగా వచ్చిన రిజిస్ట్రారు వెంటనే 30,000రూపాయలు కట్టమని, లేకపోతే ఇల్లు ఖాళీ చేయమని వత్తిడి చేసాడట. మా బావగారు వెళ్ళి వుంటున్న ఇల్లు ఆయన స్నేహితుడుది అని, ఆయనొక డబ్బున్న బిజినెస్ మనిషి అని తెలిసింది. ఆయన చాలా మంచివారట. ఆ ఇంట్లోని గదులు, వంటగది వాళ్ళని వాడుకోమని సహాయం చేసాడట. అంతా విన్నాక మా వారు ఆలోచించడం మొదలుపెట్టారు. ఆయనకి నిద్రపట్టలేదు. రాత్రంతా ఆలోచిస్తూ పడుకున్నారు. అన్న ఏం అవస్తపడుతున్నాడో, తల్లిలాంటి ఆయన వదిన ఏం కష్టం పడుతున్నారో, పిల్లలు చూస్తే చిన్నవాళ్ళు, వాళ్ళని చూచి ఆవిడ ఏం బాధపడుతున్నారో? అక్కడ ఏం జరుగుతుందో అని. కానీ నా ఆలోచన వేరే. వారి బుర్ర ఎలా పనిచేస్తుందో, వారి మెదడు ఎక్కడ పాడైపోతుందో. పైగా మా వారి సంపాదన మీదే రెండు కుటుంబాలు ఆధారపడి వున్నాయి కదా అని నా ఆలోచనలతో నాకు నిద్రపట్టలేదు. మరునాడు మా వారు 30,000రూపాయలు మా పూర్ణకిచ్చి గూడూరు కెళ్ళి వాళ్ళ నాన్నకు ఇచ్చిరమ్మని పంపారు. అంత మొత్తం తీసుకెళ్తున్నాడని అతని భార్య రమని కూడా పంపారు దాంతో మా బావగారి ఇల్లు సమస్య తీరిపోయింది.

ప్రతి సంవత్సరం ఏదో ఒక కాపిటల్‌లో ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ జరుగుతూ వుంటుంది. అన్ని దేశాల నుంచి అన్ని భాషల సినిమాలు, దానికి తగ్గ టెక్నీషియన్స్ వస్తూ వుంటారు. అలాగే నేను, మా వారు కూడా ప్రతి ఏటా జనవరి పది నుంచి ఇరవై ఒకటి వరకు ఫెస్టివల్‌కి హాజరయేవాళ్ళం. అన్నాళ్ళుండక పోయినా ఒక వారం రోజులైనా వుండి వచ్చేవాళ్ళం. పొద్దున్నే 8.30గంటలకి ప్రారంభించిన సినిమాలు రాత్రి 1.00గంట వరకు జరుగుతూనే వుంటాయి. మేము మాత్రం 8.30 గంటలనుంచి 1 - 2 గంటలవరకు వుండి రూముకు వచ్చి భోజనం చేసి రెండు గంటలు విశ్రాంతి తీసుకుని మళ్ళీ 3-4 గంటలకు వెళ్ళి రాత్రి 10.00గంటలవరకు చూసి వచ్చేవాళ్ళం. కొన్ని సినిమాలైతే వారికి To&Fro flight charges, hospitality ఇచ్చేవారు. అంటే వారి సినిమాలు ఎంపిక అయినప్పుడు, ఇండియన్ పెనోరమకి తీసుకున్నప్పుడు. అలా ప్రతి ఏడూ మారుతీరావుగారు, ఆయన భార్య, మేము నలుగురం థియేటర్‌లో కలిసి కూర్చుంటూ, కలిసి హోటల్‌లో భోజనం చేసేవాళ్ళం. అలాగే సి.యస్.రావుగారు, భార్య రాజసులోచనగారు కూడా వస్తుండేవారు. థియేటర్‌లో మాత్రం కలుసుకునేవాళ్ళం. జంధ్యాలగారు, సత్యానంద్‌గారు కూడా వచ్చేవారు. ఒక్కోసారి హోటల్స్‌లో కలుసుకుంటూ వుండేవాళ్ళం లంచ్‌కి. అలాగ కలకత్తా, త్రివేండ్రమ్, గోవా, బెంగుళూరు పలువూళ్ళు, ఒకసారి హైదరాబాదులో కూడా జరిగింది. కానీ కేరళ అవీ చూసినప్పుడు చుట్టుపక్కల సైట్స్, దేవాలయాలు కూడా దర్శించుకుని ఫొటోలు కూడా తీయించుకునే వాళ్ళం. ఈ మధ్య ప్రతియేటా గోవాలోనే జరుగుతోంది. అలాగే త్రివేండ్రమ్ వెళ్ళినప్పుడు రాజేంద్రకుమార్, రాజ్‌కపూర్ మొదలగు హీరోలతో ఫోటోలు కూడా తీయించుకునేవాళ్ళం. వీళ్ళంతా నా చిన్నతనపు హీరోలు కదా. అయితే ముఖ్యమైన ఫేవరెట్ హీరో దేవానంద్. అతనితో ఫోటోలేదు. లోకల్ థియేటర్‌లో దేవానంద్ పాటలు, కిషోర్ కుమార్, రఫీ పాటల కాన్సర్ట్ వున్నప్పుడు 500రూపాయలు, 1000రూపాయల టిక్కెట్లు కొని వెళ్తుంటాం. మా అమ్మాయి సుధ దేవానంద్ పాటల్ని సి.డి చేసిచ్చింది నాకు.

మా పిల్లలు వాళ్ళ స్కూలు, కాలేజీల వలన, వాళ్ళిద్దరిని ఇంటి దగ్గర మా పూర్ణ భార్య చూసుకునేది. మొదటి నుంచి వాళ్ళిద్దరిని వదిలి ఎక్కడికైనా వెళ్ళడం బాగా అలవాటు చేసాను. వాళ్ళతో వెళ్ళే స్థలాలకు మాత్రం తప్పకుండా పిల్చుకెళ్ళేవాళ్ళం.

ఒకసారి 'పంతులమ్మ' షూటింగు జరిగింది. మా వారు, ప్రొడక్షన్ ట్రూప్ అంతా ముందుగానే వెళ్ళిపోయారు. ఒక వారం అయిన తరువాత కృష్ణంరాజుగారు ఏనుండి మదరాసుకు వచ్చారు. నాకు ఫోన్ చేసారు. "ఎల్లుండి నా భార్య, రంగనాథ్ గారి భార్య మేమంతా కార్లో వూటీకి వెళుతున్నాము. వస్తారా?" అని అన్నారు. అప్పుడు నాకు ఏం చెప్పాలో తెలియలేదు.

రాత్రి మా వారు ఫోన్ చేసారు. "కావలిస్తే నువ్వు కూడా రా. ఇది నీకు అవకాశం కదా" అని.

సరే అని ప్రయాణం అయ్యాను.

నన్ను పిల్చుకు వెళ్ళడానికి కారులోంచి కృష్ణంరాజుగారు దిగి మేడమీదకు వచ్చారు. "మీ ఇద్దరి పిల్లలకి కారులో స్థలం లేదు. పోనీ చిన్న పిల్లనైనా పిలుచుకు రండమ్మా. డైరెక్టరుగారు పిల్లలో అంటున్నారు" అన్నారు.

"కాదండీ, పిల్చుకొస్తే ఇద్దర్నీ పిల్చుకు రావాలి, వదిలేస్తే ఇద్దర్నీ వదిలేయాలి. వాళ్ళను చూసుకోవడానికి పూర్ణ భార్య వుందిలెండి" అన్నాను.

అలా కృష్ణంరాజుగారి భార్య, రంగనాథ్ గారి భార్య, వాళ్ళబ్బాయి చిన్నవాడు అయినందున వాడ్ని పిల్చుకు వచ్చారు కానీ ఒళ్ళోనే కూర్చోపెట్టుకుంది. నేను సరే సరి. అందరం వెళ్ళాం. అక్కడికి చేరేసరికి అర్ధరాత్రి అయింది. మరునాడు షూటింగుకి వాళ్ళతో పాటు మేము వెళ్ళాం. నేను ఊటీకి వెళ్ళడం అదే మొదటిసారి. ఊటీలో చుట్టుపక్కల సైట్స్ చూడటం, దొడ్డ బెట్ట, షాపింగు, అక్కడ ఏలక్కాయలు, లవంగాలు, మిరియాలు, డ్రైఫ్రూట్సు, చాక్లెట్లు అన్నీ ఫేమస్. అవన్నీ కొనుక్కుని వచ్చాము ఒకరోజు. ఇంకోరోజు ఒక పాట పిక్చరైజేషన్ షూటింగు చేసారు. సగం పాట మొదట లక్ష్మి, రంగనాథ్ మీద చిత్రీకరించారట. నే వెళ్ళిన తరువాత రెండవ భాగం రంగనాథ్, దీప మీద చిత్రీకరించారు. ఆ పాట "మానస వీణా మధుమాసం" చాలా బాగుంది. క్లాసికల్‌గా వుండి చాలా మాధుర్యంగా వుంది. సంగీతం రాజన్ నాగేంద్ర. ఇది వేటూరిగారి రచనకి సంగీతం, మ్యూజిక్ డైరెక్టర్స్ శ్రావ్యంగా ట్యూన్ కట్టారు. వేటూరిగారికి ఈ పాట రచనకి మొట్టమొదటిసారిగా నంది అవార్డు వచ్చింది. సినిమా కూడా బాగా ఆడింది.

కొద్దికాల వ్యవధిలోనే మా వారు నవతా కృష్ణంరాజు గారికి మూడు సినిమాలు చేసారు. 'జమిందారుగారి అమ్మాయి', 'అమెరికాఅమ్మాయి', 'పంతులమ్మ'. ఈ మూడు సినిమాలు హిట్స్. మా శకుంతల హైస్కూలు అయిం తరువాత యస్.ఐ.ఇ.టి కాలేజీలో ఇంటర్, బి.కాం చదివి పాసైయింది. చిన్నమ్మాయి సుధని పీటర్స్ రోడ్డులో వున్న ఆదర్శ విద్యాలయంలో చేర్పించాము. ఇది పంజాబ్ అసోసియేషన్ వాళ్ళది. సుష్మా అహూజా అనే ఆమె మా వారికి కొన్ని హిందీ స్క్రిప్టులకి పనిచేసింది. ఆవిడ రికమెండేషన్‌తో మా సుధకి అక్కడ సీటు దొరికింది. తమాషా ఏమిటంటే అది పెద్దయి పెళ్ళి అయ్యాక ఢిల్లీలో 3 సంవత్సరాలు, పంజాబ్‌లో వున్న పాటియాలా దగ్గరున్న సంగ్రూర్‌లో మూడు సంవత్సరాలుంది. మా అల్లుడికి ఐ.ఓ.సి అంటే ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్‌లో పని.

సరే, మా సుధ, మా శకుంతల స్కూలుకి, కాలేజీకి వెళ్ళాలి కదా, ఆ సమయంలో రెండు మూడు పిక్చర్లు అయి మా వారు 'సామ్మొకడిది - సోకొకడిది' ప్రారంభించారు. అలాంటి సమయంలో మాకొక కారు కొనిపెట్టాలని ఆయనకి అనిపించింది. సెకెండ్ హ్యాండ్ మంచి కండిషన్‌లో వుండే ఒక కారు కొన్నారు. కానీ కొత్తదైనా, ఉపయోగించిన కారైనా, ఏదో ఒక కారు మా స్వంతం అయినందుకు మాకందరికీ ఆనందాన్నీ, సంతోషాన్నీ, తృప్తిని ఇచ్చింది. ఇక మా పిల్లలకు వాహనం ఇబ్బంది వుండదు. ఆ కారు వాళ్ళిద్దరికే పరిమితం చేసారు. నేనెక్కడికైన వెళ్ళాలంటే నాకు కూడా. మా వారికి కంపెనీ కార్లే వస్తుండేవి. ఆయనకి ఖాళీ వున్నప్పుడు అందరూ కార్లో బీచ్‌లకి, షాపింగు, ఒకటేమిటి ఎక్కడికెళ్ళాలన్నా వెళ్ళేవాళ్ళము. పాపం మా పిల్లలకి కారు రావడం ఒక థ్రిల్.

"తరం మారింది" సినిమా టైముకి వచ్చిన మా పూర్ణ. మా వారి అన్నగారి అబ్బాయి మాతోనే వుంటూ వచ్చి ఆ తరువాత 'అందమే ఆనందం' కూడా పనిచేసిన తరువాత అది రిలీజైపోయింది. తరువాత 1977 వ సంవత్సరం ఆగష్టు 19న నెల్లూరులో వున్న వాళ్ళ మేనమామ వెంకోజీగారి ఒకే ఒక కూతురు రమ అనే అమ్మాయితో పెళ్ళి జరిగింది. పెళ్ళైన తరువాత కూడా ఆ ఇద్దరూ మాతోనే వుంటున్నారు. తాను కూడా మా అందరితో కలిసి పోయేది. మా పిల్లలని కూడా తన స్వంత ఆడపడుచులుగా చూసుకునేది. ఆ అమ్మాయి వచ్చిన తర్వాత నేను అప్పుడప్పుడు వారం, పైరోజులు ఇలాగ మా వారితో వెళ్తూ వచ్చాను. మా పిల్లలు కూడా దాన్ని స్వంత వదినలా భావించి బాగా చూసుకునేవారు. ఆ అమ్మాయి దగ్గర మా పిల్లలు బాగా అలవాటు అయ్యారు.

( కొనసాగింపు వచ్చేనెలలో)



Post your comments